ప్రజాశక్తి

సోమవారం 31 జులై 2023

5

పార్వతీపురం మన్యం

## మలేరియాతో బాలుడు మృతి

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని పెద్ద పల్లంకి వలసకు చెందిన బిడ్డిక కార్తికేయ(7) మలేరియా బారినపడి మృతి చెందాడు. ఇటీవల కార్తికేయకు జ్వరం రావడంతో ధోనుబాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి, అక్కడి నుంచి సీతంపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్ తరలించారు. శనివారం రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న డిప్యూటీ డి ఎం హెచ్ఒ చిరంజీవి గ్రామాన్ని సందర్శించి, ఆదివారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. దోనుభాయి వైద్యాధికారి భానుప్రతాప్ వైద్య పరీక్షలు నిర్వహించారు. 50 మంది నుంచి రక్తపూతల సేకరించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి మలాథియన్ స్ప్రేయింగ్ చేయించారు.



# కళ్లు కలకలం

### వందల సంఖ్యలో బాధితులు
### ఆస్పత్రులకు పరుగుపెడుతున్న రోగులు

ప్రజాశక్తి - కురుపాం

జిల్లాలోని పలు మండలాల్లో కళ్లకలకల విజృంభిస్తోంది. దీని బారిన ప్రతిరోజూ వందలాదిమంది పడుతున్నట్టు సమాచారం. ముఖ్యంగా పాఠశాల విద్యార్థులు, జన సమూహం ఉండే ప్రాంతాల్లో ఎక్కువగా నివసించే ప్రజలు ఈ వ్యాధిబారిన పడుతున్నారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి రోజుకు 50మందికి పైగా కళ్లకలకల బాధితులు వస్తున్నట్లు మన్యం జిల్లా కంటి వైద్య నిపులు జీరు నగేష్ రెడ్డి తెలిపారు. వాతావరణలో మార్పుల కారణంగా కంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంటుందని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాకాలం చివరి దశలో ఎండలు, వానల కారణంగా వైరస్ ఎక్కువగా వ్యాప్తి చెందుతున్న కారణంగా కళ్లకు కండ్ల కలకల వ్యాధి ఎక్కువగా వస్తుంది. ప్రజలు అప్రమత్తంగా ఉండి కంటి వైద్యుల పర్యవేక్షణలో చికిత్స తీసుకుంటే తొందరగా నయం చేయవచ్చు. కళ్ల కలకల వల్ల ప్రమాదం లేకపోయినా అప్రమత్తంగా ఉండడం అవసరమని చెప్పారమని, సొంత వైద్యం కాకుండా కంటి వైద్యనిపుణుల సలహా మేరకు జాగ్రత్తలు తీసుకుంటే మంచిదని చెబుతున్నారు.

**వేగంగా వ్యాప్తి...**

ఇది ఒకరి నుండి ఒకరికి త్వరగా వ్యాపిస్తుంది. బాధితులు తమ కుటుంబ సభ్యులతో కలవకుండా కనీసం వారం రోజులపాటు ప్రత్యేకంగా ఒక గదిలో ఉండాలి. కళ్ల కలకసోకిన వ్యక్తి తాకిన వస్తువులను ఇతరులు తాకకుండా జాగ్రత్తలు తీసుకోవడం వల్ల వ్యాధిని కొంతవరకు నివారించొచ్చు. కళ్ల కలక సోకిన వారు తరచూ కళ్లను తాకాల్చి వస్తుంది. అలా తాకిన ప్రతిసారి చేతులు శుభ్రం చేసుకోవాలి.

కళ్ల కలతో ఆస్పత్రికి వచ్చిన రోగులు

### లక్షణాలు

కంటి నుంచి విపరీతంగా నీరు కారడం, కళ్లు ఎర్రబడడం, రెప్పలు అంటుకుపోవడం, విపరీతంగా పుసులురావడం, మంట పుట్టడం, కంటిలో ఇసుక పడినట్లు గుచ్చుకోవడం తదితర లక్షణాలుంటే నేత్ర వైద్యులు సంప్రదించాలి. గతంలో కరోనా బారిన పడిన వారిలో ఈ వ్యాధి సులభంగా వ్యాపించే అవకాశం ఉంది. కంటి గుడ్డి చుట్టూ తెల్లని పొరరెప్పలా వెనుక ఉండే పొరను కంపెనైనా అంటారు. దుమ్ము, ధూళి, వేడి నీరు, అధిక గాలి కంటి పొరలను తాకితే శరీరంలో సున్నిత భాగమైన కన్ను తీవ్రమైన ఒత్తిడికి గురవుతుంది. సున్నితమైన అవయవాలు కావడంతో వేగంగా ఇన్ఫెక్షన్ బారిన పడే అవకాశం ఉంది. కళ్లు ఎర్రగా మారుతాయి. ఒక కంటికి కానీ కొందరికి రెండు కళ్లకి వచ్చే అవకాశం ఉంది. ఇన్ఫెక్షన్ కారణంగా కణజాలంలో చేరిన బాక్టీరియా వైరస్ ఇతరులకు వ్యాపించే ప్రమాదం ఉంది.

### ఆందోళన వద్దు

వర్షాకాలంలో ఎక్కువగా ఈ అంటువ్యాధి కనిపిస్తుంది. క్రిములు కారణంగా ఇది వ్యాపిస్తుంది. కొన్ని రోజుల్లోనే తగ్గుముఖం పట్టినా జాగ్రత్తలు తప్పనిసరి. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. చిన్నారులకు సోకితే మాత్రం వెంటనే వైద్యులను సంప్రదించాలి. వైద్యుల సూచన మేరకే చుక్కల మందు వేయించుకోవాలి.

**జీరు నగేష్ రెడ్డి**
**నేత్ర వైద్య అధికారి , జిల్లా**

### వైద్యులను సంప్రదించాలి

జిల్లాలో కండ్లకలక వ్యాధితో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. దీనికి అశ్రద్ధ వహించకుండా నేత్ర వైద్యులను సంప్రదించి వారి సూచనల మేరకు చికిత్సలు, జాగ్రత్తలు పాటిస్తే ఎటువంటి ప్రమాదం వుండదు. జిల్లాలో ఉన్న ప్రభుత్వాసుపత్రిలో ఉచితంగా చికిత్స అందిస్తున్నారు.

**డాక్టర్ బి. జగన్నాథరావు**
**జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి,**

### జాగ్రత్తలు....

కళ్ల కలకల బారిన పడినవారు కంటిని తాకకుండా ఉండేందుకు ప్రయత్నించాలి. మెత్తటి గుడ్డతో కంటి భాగాన్ని ఒత్తిడి తగలకుండా తుడుచుకోవాలి. తరచూ శుభ్రమైన నీటితో కడుక్కోవాలి. ఇంటి నుండి బయటకు రాకుండా గదిలోనే ఉండాలి. కుటుంబ సభ్యులకు సైతం దూరంగా ఉండాలి. వారం రోజుల్లోపు తగ్గకపోతే తప్పని సరిగా నేత్ర వైద్య నిపుణులను సంప్రదించాలి. వైద్యుల సూచన మేరకు చికిత్స పొందాలి. నవజాత శిశు వు కండ్ల కలక సోకితే ప్రమాదకరం. కండ్ల కలక బాధితులు చిన్నారులకు దూరంగా ఉండాలి. పాఠశాలలు, ప్రజలు ఎక్కువగా గుమ్మి కూడిన ప్రదేశాల్లో ఈ వ్యాధి వ్యాప్తి ఎక్కువగా ఉంటుంది.

# మహిళల రక్షణకై పోరు యాత్ర

### మహిళలకు రక్షణ,భద్రత,రక్షణ కల్పించాలి
### ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి

ప్రజాశక్తి - సాలూరు

దేశం, రాష్ట్రంలో మహిళలకు రక్షణ కల్పించాలని, మద్యం మత్తు పదార్థాలను నియంత్రించాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి డిమాండ్ చేశారు. ఐద్వా చేపట్టిన హింస పై మహిళలు పోరు యాత్ర ఆదివారం సాలూరు పట్టణానికి చేరుకుంది. స్థానిక ఐద్వా నాయకులు టి.ఇందు ఆధ్వర్యాన మహిళలు పోరుయాత్ర బందం సభ్యులకు గాంధీనగర్ లో ఘనస్వాగతం పలికారు. అనంతరం సాలూరు రాజేశ్వరరావు పార్కు ఆవరణలో టి.ఇందు అధ్యక్షతన నిర్వహించిన సభలో ప్రభావతి మాట్లాడారు. మహిళల రక్షణకు ఎన్ని చట్టాలున్నా హింసాత్మక ఘటనలు పెరుగుతున్నాయని చెప్పారు. చట్టాలను పటిష్టంగా అమలు చేయడం లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఇలాంటి ప్రభుత్వ విధానాలని మహిళా సంఘాలు, ప్రజాసంఘాలు ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. ప్రతి చోటా, ప్రతి క్షణం మహిళలపై దాడులు, అకృత్యాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. ప్రధానంగా మత్తు పదార్థాలు, మద్యమే కారణం అన్నారు. మహిళలకు, చిన్నారులకు రక్షణ కల్పించే చట్టాలను కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. హింసను ప్రేరేపించే అశ్లీల చిత్రాలను, ఇంటర్నెట్ కార్యక్రమాలు నిషేదించాలని డిమాండ్ చేశారు. మహిళలపై జరుగుతున్న నేరాలను అరికట్టేందుకు కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల రాష్ట్రంలో జరిగిన ఘటనలు ప్రభుత్వం నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు. విశాఖలో వరలక్ష్మి హత్య సంచలనం కలిగించిందన్నారు. రేపల్లె రైల్వేస్టేషన్లోను, విజయనగరంలో ఇద్దరు పిల్లల తల్లి ఇంటిలోనే గ్యాంగ్ రేపు గురికావడం మన రాష్ట్రంలో నేరస్థితికి దర్పణమన్నారు. ఆంధ్రాకు అరకు ఏజెన్సీ మత్తుమందుల వ్యాపారులకు అడ్డాగా మారిందన్నారు. వారికి ప్రభుత్వాలు అండగా ఉన్నాయన్నారు. మద్యం మత్తు మందుల దురలవాటుతో యువత జీవితాలను కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇన్ని నష్టాలు సమాజానికి కలుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీసం స్పందించడంలేదన్నారు. మహిళలకు చిన్నారులకు రక్షణ కల్పించే చట్టాలను కఠినంగా అమలు చేయాలని, నిందితులను ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా త్వరితగతిన విచారణ జరిపి కఠిన శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మీడియా మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయాలని, హింస, అశ్లీలత, అసమానతలను ప్రేరేపించే చిత్రాలు, టీవీ సీరియల్స్, ఇంటర్నెట్ కార్యక్రమాలను నిషేధించాలని, కాలేజీల్లో, పని ప్రదేశాల్లో వేధింపులను నిరోధించేందుకు అంతర్గత ఫిర్యాదుల కమిటీలు ఏర్పాటు చేయాలని, మత్తు పదార్థాలను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలన్నారు.పై డిమాండ్ల సాధనకు అన్ని పక్షాలను కూడ గట్టి ఐద్వా ఆందోళన సాగిస్తున్నది. రాష్ట్ర వ్యాపితంగా మహిళల పోరు యాత్ర చేపట్టనున్నది. ఆగస్టు 9న విజయవాడలో భారీ సభ నిర్వహించనుంది. ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని, అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర నాయకులు రమణి, పూర్ణ, పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీదేవి, విజయనగరం జిల్లా కార్యదర్శి బి.రమణమ్మ , యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, జిల్లా కమిటీ సభ్యులు రాజమణి, కోలక లీల, లక్ష్మీ, అంగన్వాడీ సంఘం జిల్లా నాయకులు ఇందిరా, అనసూయ, సిఐటియు నాయకులు టి.శంకర్,టి.స్వప్న పాల్గొన్నారు.

**సీతానగరం :** దేశంలోనూ, రాష్ట్రంలోనూ రోజు రోజుకు మహిళలపై దాడులు పెరుగుతున్నాయని, వాటిని ఖండించాలని ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి అన్నారు. మండలంలోని లచ్చయ్యపేటలో ఆదివారం బస్సు యాత్ర వచ్చింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిజెపి పాలనలో మహిళలపై దాడులు పెరిగాయన్నారు. మహిళలకు, చిన్నారులకు రక్షణ కల్పించే చట్టాలను కఠినంగా అమలు చేయాలన్నారు. మహిళలకు వేధింపులు ఎక్కువయ్యాయని, మద్యం, మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. ఆగస్టు 9న విజయవాడలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు ఆర్.శ్రీదేవి, వి.రామలక్ష్మి, ఇ.లక్ష్మి, ఆర్.లక్ష్మితో పాటు మహిళలు పాల్గొన్నారు.

సాలూరులో జరిగిన పోరుయాత్రలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి




సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన జెఎసి నాయకులు లక్ష్మణమూర్తి

# 9న సెలవు దినంగా ప్రకటించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఆగస్టు 9 ప్రపంచ (ఆదివాసీ దినోత్సవం) ఆదివాసీ హక్కుల దినంగా జరుపుకోవాలని ఆదివాసీ హక్కుల వేదిక ప్రతినిధులు నిర్ణయించారు. గుమ్మలక్ష్మీపురంలోని ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయంలో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన ఆదివాసి హక్కులు, చట్టాలు, గిరిజనులపై భౌతిక దాడులు చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మతం, కులం పేరుతో ప్రాంతీయ విభేదాలు రెచ్చగొట్టి గిరిజన మహిళలకు మానప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని నాయకులు వాపోయారు. ఇందుకు ఉదాహరణయే మణిపూర్‌లో గిరిజనులపై దాడులు జరుగుతున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ భావజాలంతో గిరిజనులపై దాడులు చేయిస్తుందన్నారు. గిరిజనులంతా ఐక్యంగా ఉండి హక్కులు, చట్టాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ఉత్సవాలు నిర్వహించి సెలవు దినం ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసి జెఎసి నాయకులు కె.లక్ష్మణమూర్తి, కె.అవినాష్, పి.సత్యనారాయణ, ఎన్.కృష్ణబాబు, ఎన్.సింహాచలం, ఎం.రమణ, టి.సూర్యనారాయణ, పి.సుదర్శనరావు, వై.సూర్యనారాయణ, పత్తిక లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ వాయిదా

ప్రజాశక్తి - సాలూరు

పార్వతీపురం మన్యం జిల్లా ఎస్ఎఫ్ఐ ప్లీనరీ సభలు ఆగష్టు 20కి వాయిదా పడినట్లు జిల్లా అధ్యక్షులు డి.పండు, కార్యదర్శి రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30,31 తేదీల్లో సాలూరులో నిర్వహించాల్సిన మహాసభలను కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు చెప్పారు. ఆగష్టు 20న జరుగనున్న సభలను విజయవంతం చేయాలని వారు కోరారు.

# పార్వతీపురంలో సినీనటుడు నారాయణమూర్తి సందడి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మండలంలోని వైకెఎం కాలనీలో ప్రముఖ నటుడు, దర్శకుడు ఆర్.నారాయణ మూర్తి సందడి చేశారు. సెప్టెంబర్‌లో తన స్వీయ దర్శకత్వంలో నిర్మించిన యూనివర్సిటీ సినిమా రీరిలీజ్ ప్రమోషన్‌లో భాగంగా మజ్జిగౌరి కాలనీలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ తెర్లి రవికుమార్ ఇంటికి ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా నారాయణమూర్తి విచ్చేసిన ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీ స్థాయిలో పిజి విద్యార్థులతో పాటు రాష్ట్రంలో విద్యారంగం సమస్యలపై నిర్మించిన తన యూనివర్సిటీ అనే సినిమాను విద్యార్థులు, బంధువులు మిత్రులంతా వీక్షించేలా ప్రోత్సహించాలని కోరారు. సామాజిక ప్రయోజనాల కోసం, ప్రజా సమస్యలపై చిత్రాలు నిర్మిస్తున్న తనవంటి వారికి ప్రజలే ప్రోత్సాహం అందించాలని కోరారు.

నారాయణమూర్తితో అధ్యాపకుడు రవికుమార్

చిరంజీవులు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న బేబినాయన

# చిరంజీవులుకు బేబినాయన పరామర్శ

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

అస్వస్థతకు గురైన మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులును ఆదివారం బొబ్బిలి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబీనాయన ఆదివారం పరామర్శించారు. చిరంజీవులు స్వగ్రామమైన కృష్ణపల్లి వచ్చి ఆయన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. సౌమ్యుడైన చిరంజీవులు మాష్టారుకు తన సహకారం ఎప్పుడూ ఉంటుందని భోరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి పార్వతీపురం నియోజకవర్గంలో బలపడడానికి చిరంజీవులు మాష్టారు చేసిన సేవలు ఎవరూ మరువలేనివన్నారు. అయితే రాష్ట్రంలో జరుగుతున్న వైఎస్ జగన్‌మోహనరెడ్డి రాక్షస పాలన అంతమొందించాల్సిన అనివార్య పరిస్థితుల్లో అధినాయకుడి ఎన్నికల వ్యూహాల్లో భాగంగా తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలను బాధ్యత గల కార్యకర్తగా సమర్థించి సహకరించాల్సిన ఆవసరం ఉందని అన్నారు. కష్టకాలంలో పార్టీకి సేవలు అందించిన వారిని చంద్రబాబు ఎన్నడూ మరిచిపోరని, దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్క కార్యకర్త పోరాడాలని పిలుపునిచ్చారు.

# బ్యాంకు రుణాలపై అవగాహన

ప్రజాశక్తి - బెలగాం

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో మార్నింగ్ వాకింగ్ సమయంలో ఏపీజీవీబీ గృహరుణం ప్రచార మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారులు మాట్లాడుతూ 8.30శాతం వడ్డీపై గృహాలకు రుణాలు ఇస్తున్నామన్నారు. సెప్టెంబర్ 30 వరకు ఈ రుణమేళా ఉంటుంది. నిర్వహణ ఖర్చులు కూడా ఉండవని తెలిపారు. అలాగే వికాస్ హెల్త్ కేర్, ఎంఎస్ఎంఇ రుణాలు, బంగారంపై రుణాలు, అలాగే డిపాజిట్స్ అత్యధిక వడ్డీ రేట్ 7.75శాతం కల్పిస్తున్నట్టు తెలిపారు. కావున ఖాతాదారులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీజీవీబీ రీజినల్ అడ్వాన్స్ మేనేజర్ సోమేశ్వరరావు, పార్వతీపురం బ్రాంచ్ మేనేజర్ కృష్ణసాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలపై అవగాహన కల్పిస్తున్న ఏపిజివిబి సిబ్బంది

# జగనన్న లే'అవుటేనా'

- రెండేళ్లయినా ఒక్క ఇంటి నిర్మాణం లేదు
- అరకొర పునాదులకే పరిమితం
- ఇళ్ల స్థలాలపై రియల్ ఎస్టేట్ వ్యాపారుల కన్ను

ప్రజాశక్తి- సాలూరు

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న లేఅవుట్ -5 లో గృహ నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. పట్టణంలోని గుమడాం లేఅవుట్ -5లో సుమారు 20ఎకరాల స్థలంలో ప్రభుత్వం 1440మంది లబ్దిదారులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేసి, 2020లో అప్పటి ఎమ్మెల్యే రాజన్నదొర పేదలకు ఇళ్ల స్థలాలను అందజేశారు.ప్రస్తుతం నిర్మాణంలో టిడ్కో గృహాల సముదాయం వెనుక ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. గుమడాం రెవిన్యూ పరిధిలో శివరాంపురం సమీపంలో ఉన్న ఈ లేఅవుట్ భూమిని ఎకరా రూ.20లక్షలు చొప్పున ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఈ లేఅవుట్‌లో ఇంటర్నల్ రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా,విద్యుత్ సరఫరా కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేసింది. ఎన్ని సౌకర్యాలు కల్పించినా, అధికారులు ఎంత నచ్చుజెప్పినా ఇళ్ల నిర్మాణంపై లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదు. ఇంతవరకు 200మంది లోపే పునాదులు, ఆరడుగుల గోడల వరకు నిర్మించి వదిలేశారు. సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు లబ్దిదారుల ఇళ్లకు వెళ్ళి ఇంటి నిర్మాణం ప్రారంభించాలని ఒత్తిడి చేశారు. నిర్మాణ పనులు ప్రారంభించకపోతే పట్టాలు రద్దు చేస్తామని హెచ్చరించారు. కొంతమంది తాము కట్టలేమని పట్టాలను అధికారులకు తిరిగి ఇచ్చేశారు. జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఒతో పాటు అధికారులు అనేక సార్లు స్థానిక హౌసింగ్ అధికారుల, సచివాలయం సిబ్బందిపై ఒత్తిడి పెంచే ప్రయత్నం చేశారు. సాక్షాత్తూ అప్పటి హౌసింగ్ మంత్రి శ్రీరంగనాథరాజు కూడా లేఅవుట్‌ను పరిశీలించి లబ్దిదారులకు అవగాహన కల్పించారు. డిప్యూటీ సిఎం రాజన్నదొర కూడా లేఅవుట్ ని పరిశీలించి లబ్దిదారులతో ఇళ్లు కట్టించేలా చూడాలని సచివాలయ సిబ్బందికి నచ్చుజెప్పారు. అయినా ఫలితం లేకపోయింది. మొత్తం లబ్దిదారుల్లో 20శాతం మంది మాత్రమే పునాదులు నిర్మించి వదిలివేశారు. అరకొరగా నిధులు, భూమి నాణ్యత లేకపోవడం వల్లే లబ్ధిదారులెవరూ నిర్మాణాలకు ముందుకు రానట్టు తెలుస్తోంది

### భూమి నాణ్యత పై అనుమానం

గుమడాం లేఅవుట్ -5 కోసం సేకరించిన భూమి గృహ నిర్మాణానికి అనువైనది కాదనే ప్రచారం జరుగుతోంది. ఇక్కడ పునాది నిర్మాణానికే లక్షా ఇరవై వేల రూపాయలు ఖర్చు అవుతుందని కొంతమంది లబ్దిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం గృహ నిర్మాణం కోసం లక్షా 80వేల రూపాయల చొప్పున మంజూరు చేస్తోంది. యూనిట్ విలువలో 80శాతం సొమ్ము పునాదికే సరిపోతే ఇంటిని ఎలా నిర్మించగలమని వాపోతున్నారు. ప్రభుత్వం ఎంపిక చేసిన లబ్దిదారుల్లో చాలా మంది సొంత ఇల్లు వున్నవారే ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. భవన నిర్మాణానికి అనువైన భూమి కాకపోవడం వల్లనే లబ్దిదారులు ఇళ్ల నిర్మాణానికి మొహం చాటేస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

ఇళ్ల నిర్మాణాలు జరగకు ఖాళీగా ఉన్న గుమడాం లేఅవుట్

### రియల్ వ్యాపారుల కన్ను

గుమడాం లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణంపై ఆసక్తి లేని లబ్దిదారులు తమ స్థలాలను అమ్మకానికి పెట్టినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ లేఅవుట్ లో కొంతమంది లబ్దిదారులు స్థలాలను విక్రయించారనే వాదనలు వినిపిస్తున్నాయి. పట్టణానికి చెందిన కొంతమంది కౌన్సిలర్లు కూడా స్థలాల అమ్మకాల్లో కీలకపాత్ర పోషిస్తున్నట్లు తెలుస్తోంది.చౌకగా వస్తున్నందున రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. కొంతమంది పునాదులు నిర్మించి, మరి కొందరు స్థలాలను అమ్మకానికి పెడుతున్నట్లు తెలుస్తోంది.

# జోరందుకున్న ఖరీఫ్ పనులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జిల్లాలో గత వారం రోజుల పాటు విస్తారంగా వానలు కురవడంతో రైతన్నలు పొలం పనుల్లో బిజీగా ఉన్నారు. మంగళ, బుధవారాల్లో రెండు రోజులు వ్యవధిలో కురిసిన భారీ వర్షంతో జిల్లాలో 55 శాతం వర్షపాతం నమోదైంది. భారీ వర్షాలతో చెరువులు, పొలాలు నిండుకుండలా మారాయి. మన్యం జిల్లాలో 15 మండలాల్లో లక్షా 80,000 ఎకరాల్లో వరి సాగు అవుతుంది. ఆలస్యంగా వర్షాలు కురిసినా ఖరీఫ్ పనులు ప్రారంభానికి సరిపడినంత వర్షపాతం నమోదు కావడంతో రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సీతానగరం, పార్వతీపురం, గరుగుబిల్లి, వీరఘట్టం, గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియమ్మవలస మండలాల్లో దమ్ములు, వరినాట్లు జోరందుకున్నాయి. 20శాతం వరి నాట్లు పూర్తయ్యాయి. ఆగస్టు నాటికి వరి నాట్లు పూర్తవుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు ఆలస్యం కావడంతో పలుచోట్ల రైతులు ఎక్కువ శాతం ఎదలు జల్లు

ట్రాక్టర్‌తో దమ్ము పడుతున్న రైతులు

నాట్లువేస్తున్న మహిళలు

కున్నారు. ఏజెన్సీలో కొండపోడు వ్యవసాయానికి వర్షం ఎంతగానో అనుకూలంగా ఉంటుందని గిరిజన రైతులు చెబుతున్నారు. గిరిజన మండలాలైన గుమ్మలక్ష్మీపురం, కురుపాం ప్రాంతాల్లో రైతులు వర్షాధారంపై ఆధారపడి ప్రతి ఏడాది పంటలు పండిస్తుంటారు. చెక్ డ్యాములు, మినీ రిజర్వాయర్లు, సాగునీటి వనరులు ఉన్నా నిర్వహణ లోపంతో పూర్తిగా పడకేశాయి. జియమ్మవలస, గరుగుబిల్లి మైదాన ప్రాంతంలో వర్షాధారం, సాగునీటి వనరులు ద్వారా వచ్చే నీటితో పంటలు వేస్తుంటారు. తోటపల్లి ఎడమ కాలువ నీరు విడుదలతో జిఎంవలస, గరుగుబిల్లి మండలాల్లో పంట పొలాలకు నీరు పుష్కలంగా అందుతుంది. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులు జీడి, చింతపండు ప్రధాన పంటలైనప్పటికీ తరతరాల నుంచి పోడు వ్యవసాయంలో కంది, పత్తి, బొబ్బర్లు, జనుములు, చోడి పంటలను గిరిజనులు ఎక్కువగా పండిస్తున్నారు. ఖరీఫ్ పనులు ముమ్మరంగా జరుగుతున్న దృష్ట్యా రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు సకాలంలో పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు.

రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

## గోరటిలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని మారుమూల గిరిశిఖర గ్రామమైన గోరటిలో రాఫా ఫౌండేషన్, మధు శ్రీ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మధు శ్రీ హెల్త్ కేర్ వైద్యులు రవికుమార్ గిరిజనులకు వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా గ్రామంలో 83మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వర్షాకాలంలో ప్రజలు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం మహిళలకు చీరలు, పురుషులకు షర్టు, పంచలను పంపిణీ చేశారు. మారుమూల గిరిజన గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఈ సందర్భంగా గిరిజనులు కొనియాడారు. కార్యక్రమంలో రాఫా ఫౌండేషన్ డైరెక్టర్ ప్రవీణ్, మహంతి, ఎం.శోభన్‌బాబు, గంట పెంటయ్య తదితరులు ఉన్నారు.

పాఠశాలలో నిరీక్షణ గదిలేక బయట వేచిఉన్న డిసిసి అధ్యక్షులు, విద్యార్థుల తల్లిదండ్రులు

## విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని భద్రగిరి పిటిజి గిరిజన గురుకుల వసతి గృహాల్లో విద్యార్థులకు సరిపడా స్నానపు గదులు, మరుగుదొడ్ల వంటి మౌలిక సౌకర్యాలు కల్పించాలని డిసిసి అధ్యక్షులు నిమ్మక సింహాచలం కోరారు. వందలాది మంది విద్యార్థులున్నచోట మరుగుదొడ్లు, స్నానపు గదులు సరిపడినవి లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. అలాగే తమ పిల్లలను చూసేందుకు జిల్లాలోని నలుమూలల నుంచి వచ్చిన తల్లిదండ్రులు వేచి ఉండడానికి విశ్రాంతి షెడ్లు లేకపోవడంతో ఎండకు, వర్షానికి ఇబ్బందులు పడుతూ గేటు బయట నిరీక్షించాల్సి వస్తుందన్నారు. వెయిటింగ్ హాలు ఏర్పాటు చేయాలని కోరారు.

కొత్తగా ఎన్నికైన ఎంటిఎస్ జిల్లా కార్యవర్గం

## ఎంటిఎస్ జిల్లా కార్యవర్గం ఎంపిక

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

98సం. పరిమితకాల ఉపాధ్యాయ(ఎంటిఎస్) సంఘం ఎంపిక ఆదివారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో జరిగింది. ఆ సంఘం రాష్ట్ర కమిటీ సలహాదారు బి.ఉమామహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షులుగా పూడి శంకరరావు, ప్రధానకార్యదర్శిగా జివిడి దామోదరప్రసాద్, ఉపాధ్యక్షులుగా ఆర్‌వి ప్రసాద్, తవిటినాయుడు, జాయింట్ సెక్రటరీగా ఎన్.కోటేశ్వరరావు, కోశాధికారిగా బి.రామచంద్రన్, అదనపు కోశాధికారిగా సిహెచ్ రవీంద్రతో పాటు, పలుమండలాలకు చెందిన 14మంది ఉపాధ్యాయులను కార్యవర్గ సభ్యులుగా ఎంపికచేశారు. ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యులకు పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

పేదలకు అన్నదానం చేస్తున్న రవికుమార్ కుటుంబ సభ్యులు

## పేదలకు అన్నదానం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణంలోని ప్రధాన రహదారిలో ఉన్న కంగట వీధి జంక్షన్ వద్ద వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహం వద్ద ఆదివారం బి న్యూ సెల్ పాయింట్ మేనేజర్ బోడపిండి రవికుమార్ తమ కుమార్తె హద్య మొదటి పుట్టినరోజు సందర్భంగా పేదలకు అన్నదానం నిర్వహించారు. తమకు ఒక పూట ఆకలి తీర్చినందుకు పేదలు చిన్నారిని ఆశీర్వదించారు. చిన్నారి పుట్టినరోజు సందర్భంగా ఇటువంటి మంచి కార్యక్రమం, నిర్వహించినందుకు తల్లిదండ్రులను పలువురు అభినందించారు.

## పార్కులో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కులో పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం సెలవు కావడంతో పర్యాటకులు జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చారు. పార్కులో ఉన్న అందాలను ఆస్వాదించారు. జల విహార్ వద్ద బోట్ షికారు చేశారు. చిన్నారులు కమాండో నెట్ ఎక్కి ఆడుకున్నారు. జెయింట్ వీల్ ఎక్కి ఆకాశంలో ఉయ్యాల ఊగారు. ఆనంద్ విహార్ వద్ద ఉల్లాసంగా ఉత్సాహంగా డాన్సులు వేశారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కెరలు కొట్టారు. యువతీ యువకులు హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడిచి వెళ్లారు. అనంతరం మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించారు.

మెట్టుగూడ జలపాతం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

## ఎంఇఒలకు మెమోలు ఇవ్వడం భావ్యం కాదు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మండల విద్యాశాఖ అధికారులకు జిల్లా విద్యాశాఖాధికారి మెమో ఇవ్వడం సరికాదని పిఆర్‌టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు అమరాపు సూర్యనారాయణ అన్నారు. నాడు-నేడు పనులు జాప్యానికి ఎంఇఒలది ఎంత వరకు బాధ్యత ఉందో విద్యాశాఖ అధికారికి తెలియాలని అన్నారు. నిధులుండీ పనులు చేయకపోతే తప్పని, నిధులు లేమితో ఉన్నతాధికార్ల ఒత్తిడితో చాలా మంది డబ్బులు అప్పుజేసి, బంగారాలు కుదువపెట్టి పనులు చేసిన వారూ ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు-నేడు కార్యక్రమానికి నిధులు విడుదలకు జిల్లా కలెక్టర్, ఉపముఖ్యమంత్రి ద్వారా ప్రయత్నించాలి తప్ప ఇలా మెమోలు ఇచ్చి ఎంఇఒలను ఆందోళనలకు గురిచేయడం మంచిదికాదని సూర్యనారాయణ తెలిపారు. నిధులున్నా పాఠశాలల బాధ్యులు పనులు పూర్తి చేయాలని, నిధులు లేని పాఠశాలల ఎస్ ఎం సీ చైర్మన్లు సోమవారం స్పందన కార్యక్రమంలో కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి వినతిపత్రాలు అందజేయాలని సూర్యనారాయణ పిలుపునిచ్చారు.

## హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బిసి సంక్షేమ వసతి గృహాలు అనేకం అద్దె భవనాల్లో చాలీచాలని వసతులతో నడుపుతున్నారని తక్షణమే సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించి మౌలిక సదుపాయాలు కల్పించాలని సామాజిక హక్కుల వేదిక నాయకులు పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం పార్వతీపురంలో ఆయన మాట్లాడుతూ కురుపాంలోని గిరిజన బాలికల కళాశాల వసతి గృహానికి సొంత భవనం లేదని తెలిపారు. అలాగే పార్వతీపురంలోని రెండు బిసి కళాశాల వసతి గృహాలకు, ఒక పాఠశాల బాలికల వసతి గృహానికి సొంత భవనాల్లేవని తెలిపారు. అలాగే రెండు ఎస్సీ బాలికల కళాశాల వసతి గృహాలకు సొంత భవనం లేదని తెలిపారు. సాలూరు, పాలకొండలోనూ ఇదే పరిస్థితి ఉందని ఆయన అన్నారు. తక్షణమే సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాల నిర్మాణానికి భూమి, నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

భామినిలో ప్రచారం చేస్తున్న టిడిపి మహిళా నాయకులు

# అక్రమ నిర్మాణాలు... కనబడని కాలువలు

### కన్నెత్తి చూడని మున్సిపల్ అధికారులు
### బరితెగిస్తున్న భవన నిర్మాణ యజమానులు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సిపల్ పరిధి పలుచోట్ల ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న కాలువలపై భవన నిర్మాణ యజమానులు అక్రమ కట్టడాలను నిర్మించడంతో మున్సిపల్ కాలువలకు రక్షణ కరువైంది. పట్టణంలో అసలే అంతంతమాత్రంగా జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పనులు జరుగుతున్నాయి. దీనికి తోడు కాలువలపై అక్రమ నిర్మాణాలతో కాలువల్లో పేరుకుపోయిన పూడికలు పెరిగిపోయాయి. వీటిని తొలగించేందుకు అవకాశం లేకుండా నివాస, వాణిజ్య గృహ యజమానులు మునిసిపల్ కాలువలను ఆక్రమించి తమ భవన నిర్మాణాలు చేస్తున్నప్పటికీ ఆక్రమణలు జరుగుతున్నాయి. ప్రారంభ దశ నుండే పర్యవేక్షణ చేయాల్సిన టౌన్ ప్లానింగ్, ప్రజారోగ్య విభాగం అధికారులు, సంబంధిత ఆయా వార్డు సచివాలయాల టౌన్ ప్లానింగ్ కార్యదర్శులు కనీసం పట్టించుకోకపోవడంతో భవననిర్మాణ యజమానులు బరితెగించి మరీ కాలువలపై పలకలను, రేకు షెడ్లను వేసి అక్రమ కట్టడాలు చేస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో రాకపోకలకు ఇబ్బంది కలిగి ట్రాఫిక్ సమస్య కూడా కలుగుతుంది. ఈ ఆక్రమణల వల్ల భారీగా కురిసే వర్షపు నీరు మురుగు కాలువలలోకి వెళ్లేందుకు అవకాశం ఉండడంలేదు. దీంతో మురుగు నీరు, వర్షపు నీరు ఏకమై రోడ్లపైనే ప్రవహించే అవకాశాలు ఉండడంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రానున్న రోజుల్లో మరింత జఠిలం కానుంది. కావున టౌన్ ప్లానింగ్, ప్రజారోగ్య విభాగం అధికారులు ముందస్తుగా కాలువలపై ఉన్న ఆక్రమణలను తొలగించి కాలువల్లో ఉన్న పూడికలను తొలగించేందుకు చర్యలు చేపడితే వర్షపు నీరు మురుగు కాలవల ద్వారా వెళ్లేందుకు అవకాశం ఉంటుందని ఈ సమస్య పరిష్కారానికి ఆక్రమణలను యుద్ధ ప్రాతిపదిక తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

కాలువలపై నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లు

## సోమగండిలో మహాశక్తియాత్ర

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని సోమగండిలో మహాశక్తియాత్ర ప్రచారం ఆదివారం నిర్వహించారు. ఈ గ్రామంలో మహాశక్తి ప్రచారకర్త తోయక సంధ్యారాణి ఆ గ్రామ గిరిజనులను కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే పంచాయతీ పరిధిలోని సమస్యలను భవిష్యత్తులో తెలుగుదేశం ప్రభుత్వం వస్తే పంచాయతీకి కావాల్సిన అన్ని సౌకర్యాలను నెరవేర్చుకోగలమని, నిమ్మక జయకష్ణను గెలిపించుకుటేనే మన సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బిడ్డక చంద్రరావు. ఎంపీటీసీ ఆరిక సువర్ణ వరలక్ష్మి, సవర తిక్కమ్మ, సరోజిని, అప్పలమ్మ, సుండమ్మి, సుందరి. మంగమ్మ, చంద్రమ్మ, మల్లమ్మ, పార్వతి స్థానిక మహిళలు పాల్గొన్నారు.

**భామిని :** స్థానిక సర్పంచ్ లోపింటి రాజేశ్వరి ఆధ్వర్యంలో టిడిపి మహిళా కార్యకర్తలు ఆదివారం భామినిలో మహాశక్తి యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుమహిళ మండల అధ్యక్షులు వలురౌతు సంధ్యారాణి మాట్లాడుతూ టిడిపి ప్రకటించిన నూతన మేనిఫెస్టోలో తల్లికి వందనం, ఆడబిడ్డ నిదిధి దీపం పేరుతో ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి సంక్షేమ కార్యక్రమాలు పెట్టారని తెలిపారు. టిడిపితోనే రాష్ట్రంలో మహిళకు గౌరవం, ఆర్థికాభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. ఈ సందర్భంగా టిడిపి మహిళా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి టిడిపి మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. టిడిపిని బలోపేతం చేసి, మనం కలిసికట్టుగా నిమ్మక జయకృష్ణను గెలుపుంచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సభ్యులు బిడ్డిక విమల, ముద్దమ్మ, మహిళా ఉపాధ్యక్షులు బర్రి సుస్మిత, మహిళా కార్యదర్శి పడాల విజయలక్ష్మి, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మెడిబోయిన జగదీశ్వరరావు, నాయకులు భూపతి ఆనందరావు, బిడ్డికి ప్రసాద్, లోపింటి రాజేష్, గురిబిల్లి లక్ష్మీ పతి, కోరాడ రాజేష్, లోపింటి చరణ్, అంపిలి కేశవ తదితరులు ఉన్నారు.

## క్షేత్రస్థాయిలో స్పందన సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - బెలగాం

జగనన్నకు చెబుదాం పేరుతో ప్రతి సోమవారం గ్రామ, వార్డు, మండల, మున్సిపాలిటీ, జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో అర్జీదారుల సమస్యలను క్షేత్రస్థాయిలో తప్పనిసరిగా పరిష్కరించాలని జనసేన నాయకులు కోరారు. ఆదివారం విలేకరులతో వారు మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో సమస్యలు పరిష్కరించాల్సిందిగా సమర్పించిన అర్జీలు పరిష్కారం కావడంలేదని, దీంతో పదేపదే వెళ్లి అర్జీలు సమర్పించినా లాభం ఉండటం లేదని పలువురు అర్జీదారులు తమ వద్ద వాపోయినట్లు తెలిపారు. సమస్యలు పరిష్కారం కాకపోవడానికి సంబంధిత అధికారులు శ్రద్ధ చూపెట్టకపోవడమేనన్నారు. బాధితుల్లో ఎక్కువమంది నిరక్షరాస్యులు, పలుకుబడి లేని అనాథలే ఉంటున్నారన్నారు. ప్రతి సోమవారం దాదాపు వందకు పైగా ఫిర్యాదులు వస్తున్నాయంటే క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారం జరగట్లేదని అర్థమవుతుందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కరించి అర్జీదారులు జిల్లా కేంద్రానికి వచ్చే ప్రయాస తగ్గించాలని కోరారు. విలేకరుల సమావేశంలో జనసేన నాయకులు వి.దాలి నాయుడు, అన్నా బత్తుల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

# జగనన్న కాలనీల్లో మౌలిక సౌకర్యాలేవీ?

### జనసేన నియోజకవర్గ నాయకులు అక్కివరపు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్/బలిజిపేట

జగనన్న కాలనీలో మౌలిక సౌకర్యాలు లేకుండా పేదలు ఇళ్లు నిర్మిస్తారని జనసేన పార్వతీపురం నియోజకవర్గం నాయకులు అక్కవరపు మోహన్‌రావు ప్రశ్నించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు ఆదివారం బలిజిపేట, పార్వతీపురం మండలాల్లో గల జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాల పరిస్థితిని పరిశీలించేందుకై కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మోహన్‌రావు మాట్లాడుతూ జగనన్న లేఅవుట్‌లో ఇళ్లు నిర్మించేందుకు కావాల్సిన సరుకులను తీసుకుపోయేందుకు రోడ్లు, నీళ్లు, విద్యుత్ సౌకర్యాల్లేవన్నారు. ఇలాంటి జగనన్న లేఅవుట్లలో పేదల ఇళ్ల నిర్మాణం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఇళ్ల నిర్మాణాల పేరిట వైసిపి నాయకులు అక్రమాలకు పాల్పడుతున్నారని తీవ్రంగా విమర్శించారు. ఇప్పటికైనా జగనన్న లేఅవుట్లలో మౌలిక సౌకర్యాలు కల్పించి ఇళ్ల నిర్మాణాలకు వైసిపి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. అనంతరం బలిజిపేట మండలం మిత్తి వలసలో ఎలిమెంటరీ స్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో బలిజిపేట మండల జనసేన అధ్యక్షులు బంకురు పోలినాయుడు, మండల నాయకులు పి కళ్యాణ్, ఎస్ రవి, ఫకీరు, పార్వతీపురం జనసేన మండల అధ్యక్షులు ఆగూరు మణి, కె.విశ్వేశ్వరరావు, సిహెచ్ గణేశ్వరరావు, కె.మణికంఠ, పి.అప్పలరాజు, బలిజిపేట, పార్వతీపురం మండలాల జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

**సీతానగరం :** మండలంలోని బుడ్డిపేటలో జగనన్న కాలనీని జనసేన నాయకులు సందర్శించి అక్కడ పరిస్థితుల పరిస్థితులు పరిశీలించారు. ఇక్కడ కనీసం రోడ్డు, డ్రైనేజీ, తాగునీటి సదుపాయం లేకుండానే ఇళ్లు ఇచ్చేశాం... కట్టేయండి అంటే ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. అలాగే సువర్ణముఖి నది తీరాన స్థలం ఇవ్వడం వల్ల లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే లేఅవుట్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల జనసేన నాయకులు శివశంకర్ పోతల, అల్లు రమేష్, జయశంకర్, జై, నాగరాజ్, వరుణ్, సంతోష్, సాయి పాల్గొన్నారు.

జగనన్న లేఅవుట్ వద్ద నిరసన తెలుపుతున్న అక్కివరపు మోహనరావు

అర్ధాంతరంగా నిలిచిపోన తహశీల్దార్ కార్యాలయం వద్ద నిర్మిస్తున్న సచివాలయ భవనం

## అర్ధాంతరంగా సచివాలయ నిర్మాణాలు

ప్రజాశక్తి - వీరఘట్టం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత గ్రామస్థాయిలో సమస్యలు పరిష్కారం కావాలనే ఉద్దేశంతో గ్రామాల్లో సచివాలయాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు 2020 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ నిధులతో సుమారు రూ.40 లక్షలు అంచనా వ్యయంతో భవన నిర్మాణాలకు ఆమోదం తెలిపారు. ఇందులో భాగంగా మండల కేంద్రానికి నాలుగు సచివాలయాలు మంజూరయ్యాయి. వీటిలో ఒకటి ప్రభుత్వం భవనంలో ఉండగా, మిగిలిన మూడింటి భవన నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. రెండు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద, మరొకటి పాత పంచాయతీ కార్యాలయం పక్కన నిర్మాణ దశలో ఉన్నాయి. వీటితో ప్రారంభించి మూడేళ్లు కావస్తున్నా నేటికీ ఇంకా శ్లాబ్ దశల్లోనే ఉన్నాయి. ఇటీవల గుత్తేదారుకు బిల్లులు మంజూరు చేసినా, పనులు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. భవన నిర్మాణాలు చేపట్టకపోవడంతో చుట్టూ మొక్కలు మొలుస్తూ పాడుబడిన భవనాల్లా కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సచివాలయ భవననిర్మాణాలను తక్షణమే పూర్తి చేసి ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## నాలుగేళ్లలో పదిమంది పిఆర్ జెఇలు

ప్రజాశక్తి- దెంకాడ

వైసిపి ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లలో మండలంలో పదిమంది పంచాయతీరాజ్ జెఇలు పని చేశారు. ఇక్కడ పని చేస్తున్న జెఇలు అధికారులకు, ప్రజాప్రతినిధులకు నచ్చకపోవడంతో పట్టుమని పది రోజులు కూడా ఇక్కడ పనిచేసే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో మండలంలో అభివృద్ధికి కుంటుపడుతున్నాయి. రోజుకొక జెఇ మారడంతో గ్రామాల్లో పనుల గురించి ఎవరికి చెప్పాలి ఎవరి దగ్గరికి వెళ్లి ఎంబుక్ చేయించుకోవాలో అర్థంకాక సతమతమవుతున్నారు. ఇప్పటికే చేసిన పనులకు బిల్లులు అవ్వకపోవడంతో ర్పంచులు, ఎంపిటిసిలు పీకల్లోతు అప్పుల్లో మునిగిపోయారు. దీనికి తోడు జెఇలు తరచూ మారడంతో ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటివరకు ఇక్కడ సుమారు పదిమంది వరకు పనిచేశారు. వారిలో రెండో కరోనా తర్వాత ప్రకాష్ రావు చనిపోయారు. ఆ తరువాత బివి సత్యనారాయణ, జె.రమేష, ఎం సూర్యకుమారి, ఏ చంద్ర నాయుడు, బి గణేష, ఎం సుధాకర్ పనిచేశారు. ఇప్పుడు ఎం సుధాకర్ అయితే ఉంటారో వెళ్లిపోతారో తెలియక ప్రజాప్రతినిధులు ఆందోళన చెందుతున్నారు.

## ఓట్లు నమోదు చేయాలి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి- బొబ్బిలి

18ఏళ్లు నిండిన వారందరు ఓటు నమోదు చేసుకునేలా చూడాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు కోరారు. వైసిపి కార్యాలయంలో ఆదివారం పోలింగ్ బూత్ కన్వీనర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని వైసిపి విజయానికి పని చేయాలన్నారు. 18ఏళ్లు నిండిన వారంతా ఓటు హక్కు పొందేలా చూడాల్సిన బాధ్యత బూత్ కన్వీనర్లపై ఉందన్నారు. ఓట్లు నమోదుపై పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో వైసిపి పట్టణ అధ్యక్షులు ఇంటి గోపాలరావు, మున్సిపల్ చైర్మన్ సావు మురళి, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులు తూముల భాస్కరరావు, జెడ్‌పిటిసి, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**ఓటు వజ్రాయుధం**

ఓటు వజ్రాయుధమని తహశీల్దార్ డోల రాజేశ్వరరావు అన్నారు. పట్టణంలోని ఓటర్ల జాబితా దర్యాప్తుపై ఆదివారం సర్వే చేశారు. ఓటు వజ్రాయుధమని, 18ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటును నమోదు చేసుకుని ఓటుహక్కు పొందాలన్నారు. ఓటు హక్కుతో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవచ్చునని చెప్పారు. ఓటుహక్కుపై ఇంటింటికి వెళ్లి యువతకు అవగాహన కల్పించారు. ఓటర్ల దర్యాప్తు సమగ్రంగా నిర్వహించాలన్నారు. ఓటర్ల జాబితాలో తప్పులను సరి చేయాలని బిఎల్‌ఓలను కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళ అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని చందన్ ఎసి లాడ్జిలో మహిళ అనుమానాస్పదంగా మృతి చెందిందని ఇంచార్జ్ సిఐ చంద్రశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని కాలేజీ గ్రౌండ్ ఎదురుగా ఉన్న చందన్ ఏసి లాడ్జిలో ఈనెల 24న అరకు మండలం, ఉరుముల గ్రామానికి చెందిన మాదాల శ్రీరాములు అనే వ్యక్తి 103 నెంబర్ రూమును తీసుకుని ఏ రోజు రూమ్ రెంట్ ఆ రోజే చిల్లుస్తూ ఈ నెల 28 వరకు ఉన్నాడు. 28 తేదీ శుక్రవారం సినిమాకి వెళ్లి వస్తానని బాయ్‌తో చెప్పి వెళ్లి ఆదివారం వరకు లాడ్జికి రాలేదు. ఆదివారం రూమ్ నుండి దుర్వాసన వస్తుండడంతో లాడ్జి నిర్వాహకులు 100 కి డయల్ చేసి విషయాన్ని చెప్పారు. వెంటనే స్థానిక స్టేషన్ ఇంచార్జ్ సిఐ చంద్రశేఖర్, ఎస్ఐ తారకేశ్వరరావు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని లాడ్జి రూమ్ తెరిచి చూడగా ఓ మహిళ రక్తపు మడుగులో మృతి చెంది ఉండటాన్ని గమనించారు. వెంటనే విజయనగరం క్లూస్ టీమ్‌ను రప్పించారు. డిఎస్‌పి ఆర్ గోవిందరావు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారని సిఐ తెలిపారు. క్లూస్ టీమ్ వేలిముద్రలు, వివరాలు సేకరించారని త్వరలోనే నిందితుని పట్టుకొని అన్ని వివరాలు వెల్లడిస్తామని ఆయన తెలిపారు. మృతి చెందిన మహిళ ఎవరు అనేది తెలియాల్సి ఉందని చెప్పారు.